**సంస్మరించుకుందాం**

**2024 మార్చి 16-కా॥ఎం.ఆర్ 11వ వర్ధంతి**

# నిబద్ధ కమ్యూనిస్టు, రైతుకూలీపోరాటయోధుడు కామ్రేడ్ మానం రామారావుకు నివాళి



**గుంటూరు జిల్లా** బాపట్ల తాలూకా నర్సాయపాలెం గ్రామంలో జన్మించిన కామ్రేడ్ మానం రామారావు–నిబద్ధతగల కమ్యూనిస్టుగా, రైతుకూలీ పోరాట యోధునిగా, కమ్యూనిస్టు విప్లవకారునిగా, సిపిఐ (ఎం–ఎల్) నాయకునిగా బాధ్యతలు నిర్వహించారు. ఉద్యమ జీవితంలో నిర్బంధం, అరెస్టులు, జైలు జీవితం, రహస్య జీవితంవంటి క్లిష్టపరిస్థితులనన్నీ ఆయన ధైర్యంగా ఎదుర్కొన్నారు. పార్టీ, రైతుకూలీ ఉద్యమ నిర్మాణాలలో క్రియాశీలపాత్ర నిర్వహించారు. తరిమెల నాగిరెడ్డి మెమోరియల్ ట్రస్టు సంస్థాపకుల్లో ఒకరుగా ఎమ్మార్ విస్తృతకృషి సాగించారు. విప్లవ కమ్యూనిస్టుల పక్షపత్రిక 'జనశక్తి' సంపాదకుని హోదాలో బాధ్యత వహించారు. నిరంతర ఆందోళనాకారునిగా ప్రజలకు నాయకత్వం వహించటంతోపాటు ఎమర్జన్సీ తదనంతరకాలంలో ప్రజాఉద్యమాలపై – ముఖ్యంగా కొండమొదలు గిరిజనోద్యమంపై ప్రభుత్వ పోలీసుల హత్యాకాండ, అణచివేతలను ఎలుగెత్తి ఖండించటంలో, వారి పోరాటధృతి సడలకుండా ధైర్యాన్ని అందించటంలో; గుంటూరు జిల్లా కొండమోడు తదితర ఆందోళనోద్యమాలకు కొండంత అండగా కామ్రేడ్ ఎంఆర్ ముందు నిలిచారు. దాదాపు 7 దశాబ్దాల తన కమ్యూనిస్టు ఉద్యమ రాజకీయ జీవితంలో మార్క్సిజం – లెనినిజం – మావో ఆలోచనా విధానం పట్ల అచంచల విశ్వాసంతో, కమ్యూనిస్టు క్రమశిక్షణతో, నిబద్ధతగల కామ్రేడ్‌గా ఆయన జీవించారు. ఒక మధ్యతరగతి రైతుగా కమ్యూనిస్టు పార్టీలో ప్రవేశించి, వ్యక్తిగత ఆస్థులు పెంచుకోకుండా, మిగుల్చుకోకుండా ఆదర్శంగా నిలిచారు. పార్టీ, రైతుకూలీ ఉద్యమ నిర్మాణంలోని కార్యకర్తలు కా॥ ఎంఆర్‌లోని విశిష్ట లక్షణాలను స్ఫూర్తిదాయకంగా తీసుకొని కృషిసాగించటమే ఆయనకు అర్పించే సరైన నివాళి.

★ ★ ★ ★ ★